క్లుప్తంగా

వైభవం.. ప్రసన్న విశ్వేశ్వరుడి కల్యాణం

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని సన్న విశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు ఎ.రవిశంకర్ తొలుత ఆలయంలోని మూల మూర్తులకు, అనంతరం ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై కొలువుదీర్చారు. భక్తుల శివనామ స్మరణ, అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు శ్రీ కల్యాణ వెంకటేశ్వరుని పరిణయోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలోగల కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి పరిణయం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సీతారామయ్య తెలిపారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని, సాయంత్రం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఓటు వినియోగించుకోవడం అందరి బాధ్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజాస్వామ్య దేశంలో విలువైన ఓటు హక్కును వినియోగించుకోవడం పౌరులుగా మన బాధ్యత అని కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్‌చంద్ పిలుపునిచ్చారు. 'మన ఓటు, మన ధైర్యం, మన భవిత' అన్న నినాదంతో కడప నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఓటరు అవగాహనా బైక్ ర్యాలీని ప్రవీణ్ చంద్ ప్రారంభించారు. సంధ్య సర్కిల్, ఐటీఐ సర్కిల్, బిల్ట్ అప్ సర్కిల్, 2వ గాంధీ విగ్రహం, అల్మాస్ పేట మీదుగా.. మసాపేట, అన్నమయ్య సర్కిల్, అప్సర సర్కిల్, వై. జంక్షన్ నుండి అంబెద్కర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్లను ప్రోత్సహించడంతోపాటు ఓటింగ్ నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయడమే స్వీప్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రలోభాలకు గురికాకుండా 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు వినియోగించినప్పుడే మంచి నాయకులు ఎన్నికై దేశ అభివృద్ధికి దోహదపడిన వారవుతారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఎవరికీ ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామని తెలుపుతూ బ్యానర్‌పై ఆయనతో పాటు, పలువురు సంతకాలు చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీటీసీ మీరా ప్రసాద్, స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువ ఓటర్లు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా మేడే

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా మేడే నిలవాలని రైల్వే గూడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబాషా పిలుపునిచ్చారు. కడప రైల్వే స్టేషన్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తోందన్నారు. ఎనిమిది గంటల పనిదినాన్ని, యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును హరించి యాజమాన్యాలకు కార్మికుల శక్తిని దోచిపెట్టే కుట్రలకు పాల్పడుతోందన్నారు. పోరాడి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్పు చేసిందన్నారు. ఆర్థిక బకాసురులకు మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, గంగయ్య, నాగేంద్ర సుబ్బరామ్, సూరి, మల్లీ, రంగనాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జాతీయ కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని కడప అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు. నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి షర్మిలా రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థిగా తాను గెలిచి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో పాటు విభజనలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నిరుద్యోగ ప్రైవేటు టీచర్ల సమస్యలపై తమ మ్యానిఫెస్టోలో భరోసా కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివ కుమార్ తెలిపారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ నిరుద్యోగ ప్రైవేటు టీచర్లు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ సాగిస్తున్నారన్నారు. వారికి కనీస వేతన చట్టం అమలు చేసే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ షాకీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి వేగం సుందర నగరం



ఏడురోడ్ల జంక్షన్

- రూ. 250 కోట్లతో సర్కిళ్లు, రోడ్ల అభివృద్ధి పనులు
- నగరంలో తీరుతున్న ట్రాఫిక్ సమస్య
- అభివృద్ధి పనులను గాలికొదిలిన టీడీపీ ప్రభుత్వం
- జగనన్న ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి బాటలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆకర్షణీయమైన సర్కిళ్లు, కొత్త హంగులతో కడప నగరానికి నూతన శోభ సంతరించుకుంది. దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత కడప నగరం అభివృద్ధికి నోచుకోలేదు. అనంతరం అధికారంలోకి టీడీపీ ప్రభుత్వం నగరాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసి నిధులు కేటాయించారు. కూడళ్లు, రహదారుల విస్తరణ పనులను అధికారులు దాదాపు పూర్తి చేయడంతో జనం, వాహన దారులు ట్రాఫిక్ కష్టాలకు గురికాకుండా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

కడప సిటీ : కడప నగరంలో దాదాపు రూ. 250 కోట్లతో కడప రోడ్ల అభివృద్ధితోపాటు, కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టడం జరిగింది. కడపలో 12 కూడళ్లు అందంగా రూపుదిద్దుకున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ హయాంలో నిధులు వెచ్చించి కడప నగరాన్ని అభివృద్ధి చేశారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నగరాభివృద్ధిని గాలికొదిలేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం తన సొంత జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. వివిధ ఆకృతులలో కూడళ్లు నిర్మించేందుకు నగర పాలక సంస్థ ప్రణాళికలు రూపొందించి దాదాపు పూర్తి చేసింది. గతంలో ఉన్న కడప నగరానికి, ప్రస్తుతానికి తేడా కనిపించడంతో ఆశ్చర్యానికి గురి కావాల్సిన పరిస్థితులు లేకపోలేదు.

తీరిన ట్రాఫిక్ సమస్య

కడపలో నేడు ట్రాఫిక్ సమస్యలు తీరాయి. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి వై.జంక్షన్‌కు వెళ్లాలంటే ప్రజలు, వాహనదారులు నరకయాతన పడ్డారు. అన్నమయ్య సర్కిల్, కృష్ణా సర్కిల్, మాసాపేట సర్కిల్, వై జంక్షన్, కోటిరెడ్డి సర్కిల్ తదితర 12 సర్కిళ్ల ఏర్పాటుతోపాటు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు ప్రమాదాలు కూడా తగ్గేందుకు అవకాశం ఏర్పడింది. నగరంలోని దిశ పోలీస్ స్టేషన్ వద్ద పాత వన్‌టౌన్ సర్కిల్‌ను గాంధీ జంక్షన్‌గా మార్చనున్నారు. ఏడురోడ్ల కూడలిలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పాత జంక్షన్ స్థానంలో కొత్తగా నిర్మాణాలు చేశారు. కలెక్టరేట్–రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో మహావీర్ సర్కిల్‌తోపాటు కలెక్టరేట్ మీదుగా రిమ్స్ రైల్వే బ్రిడ్జి వరకు నాలుగువరుసల రోడ్డు తీర్చిదిద్దారు. ఇవే కాకుండా ఆయా ప్రాంతాల్లో చిన్నచిన్న కూడళ్లను ఏర్పాటుచేశారు.

జంక్షన్ పేరు	కేటాయించిన మొత్తం (రూ.లక్షలలో)
అంబేద్కర్ సర్కిల్	90
వై.జంక్షన్	70
అల్మాస్‌పేట	40
మాసాపేట	40
మార్కెట్‌యార్డు	48
మాచుపల్లె	72
కృష్ణా సర్కిల్	100
అన్నమయ్య	100
పొట్టి శ్రీరాములు(గోకుల్)	55



కలెక్టరేట్–రిమ్స్ రోడ్డు



వై–జంక్షన్



అంబేద్కర్ సర్కిల్



మరియాపురంలో చిన్నారుల బొమ్మలు



మహావీర్ సర్కిల్



కోటిరెడ్డిసర్కిల్‌లో మహనీయుల విగ్రహం



అందంగా అంబేద్కర్ సర్కిల్–వై జంక్షన్ రోడ్డు

● మేనిఫెస్టివల్



వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. సంక్షేమం కొనసాగుతుందని సీఎం జగన్ చెప్పడంతో అన్ని వర్గాల్లోనూ ఆనందం ఉప్పొంగింది. ఇక అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, పెన్షన్ల పెంపుపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఈ ఐదేళ్లలో సీఎంగా వైఎస్ జగన్ చెప్పిన వన్నీ చేశాడని.. ఇప్పుడు కూడా చెప్పింది చేస్తాడని నమ్మకంగా అంటున్నారు.

పింఛన్ పెంపు అభినందనీయం



ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టోలో పింఛన్ రూ.3 వేల నుంచి రూ. 3500కు పెంచుతామని చెప్పడం అభినందనీయం. లబ్ధిదారుల కష్టాలు గమనించిన ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం హర్షదాయకం. తమ గురించి ఆలోచించే ముఖ్యమంత్రి కలకాలం ఉండాలి.

– ఉమాపతి, దివ్యాంగుడు, కడప

ప్రమాద బీమా ప్రయోజనకరం



వాహనమిత్ర లబ్ధిదారులకు ఇస్తున్న మొత్తం రూ. 50 వేల నుంచి రూ.లక్షకు పెంచడం అభినందనీయం. అలాగే లారీ, టిప్పర్ సొంత వాహనం కలిగి నడిపే అందరికీ ప్రమాద బీమా కింద రూ. 10 లక్షలు ఇస్తామని మ్యానిఫెస్టో ద్వారా ప్రకటించిన ముఖ్యమంత్రి డ్రైవర్లు రుణపడి ఉంటారు.

– బోయినపల్లి ప్రవీణ్, డ్రైవర్, కడప

ఎమ్మెల్యే నివాళి



తిప్పిరెడ్డిపల్లెలో శ్రీవాణి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి భార్య వాణి శనివారం ఆళ్లగడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మృతదేహానికి శనివారం రాత్రి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నివాళి అర్పించి ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, శివశంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రెడ్డయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న.. విశ్వాసానికి మారుపేరు



ప్రచారం నిర్వహిస్తున్న ఎస్‌బీ అంజద్‌బాష

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశ్వాసం, నమ్మకానికి మారుపేరని వైఎస్సార్‌సీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌బీ.అంజద్ బాష అన్నారు. స్థానిక 27వ డివిజన్‌లోని గౌస్‌నగర్ ప్రాంతం అమీర్‌హాల్ వద్ద ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజద్ బాష మాట్లాడుతూ ఎన్నికల్లో మనం వేసే ఓటు మనకు నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇవ్వాలని, అది జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే జరిగిందన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. 15 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జహీర్, వైఎస్సార్ సీపీ నాయకులు పవర్ అల్తాఫ్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్రలు చిత్తు కాక తప్పదు

ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ఎన్నికల్లో చిత్తు కాక తప్పదని వైఎస్సార్ సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ తెలిపారు. స్థానిక 29వ డివిజన్‌లో ఎన్‌ఆర్‌ఐలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన అపవిత్ర కలయికను ప్రజలు హర్షించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిలాన్, అన్సర్‌బాష, బాబుభాయి, గయాజ్, అబ్దుల్ రజాక్, సాదిక్, సద్దాం, షబ్బీర్ పాల్గొన్నారు.

43, 48 డివిజన్లలో ఎమ్మెల్సీ ప్రచారం

రాబోయే ఎన్నికల్లో కడప ఎంపీగా వైఎస్.అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజద్‌బాషను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. కడప నగరం 43వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ యువ నాయకులు ఉమేర్, 48 డివిజన్లలో ఎమ్మెల్సీ ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగాలంటే మరో మారు ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సి ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

డీఏ బకాయిలు చెల్లించిన ఘనత వైఎస్ జగన్‌దే

కడప ఎడ్యుకేషన్ : చంద్రబాబు ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్‌సీని పెండింగ్ పెడితే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆ బకాయిలు చెల్లించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు వెన్నపూస రవీంద్రరెడ్డి అన్నారు. కడప నగరంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జీఎల్ఐ లోన్‌లకు సంబంధించి జూన్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న వాటన్నింటిని క్లియర్ చేశారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు కడప ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి అంజాద్‌బాషను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను కలిశారు.

రాష్ట్రానికి మళ్లీ సీఎం జగన్ అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, పక్కన అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, అనీల్ కుమార్ రెడ్డి

చెన్నూరు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు, సీకే.దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. ఆయన సతీమణి నవ్యతేజతో కలిసి మండలంలోని కొండపేట గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మైనారిటీ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అన్ని మతాల వారికి మేలు జరిగే విధంగా ఎన్నికల మ్యానిఫెస్టో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అవినాష్ రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

■ చెన్నూరు మైనార్టీ కాలనీలో డాక్టర్ నూరి పర్వీన్, నాయకులు అన్వర్ భాష, అబ్దుల్ రబ్, మునీర్ అహ్మద్, జుమన్, హస్రత్, వారిస్, సాదిక్ అలీ, నూర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

■ ముండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి, దిలీప్ రెడ్డి, తుంగా చంద్రశేఖర్ యాదవ్, దుంప నాగిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గంగులయ్య, భాస్కర్ రెడ్డి, చీర్ల సురేష్ యాదవ్, జీఎస్.భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, ముదిరెడ్డి రవి రెడ్డి, గణేష్ రెడ్డి, గుమ్మల మధుసూదన్ రెడ్డి, తదితరులు నాయకులు, ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించండి

పెండ్లిమర్రి : పేదలు, బడుగు, బహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెల్లటూరు పంచాయితీలోని వెల్లటూరు, వెల్లటూరు హరిజనవాడ, రెడ్డిపల్లె, శవాస్కన్‌పల్లె గ్రామాలల్లో శనివారం ఎమ్మెల్యేతోపాటు, ఆయన తమ్ముడి కుమారుడు కృష్ణ సాయిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, నాగమల్లారెడ్డి, మస్తాన్‌బీ, లక్ష్మిరెడ్డి, రామక్రిష్టారెడ్డి, ఉస్సేన్, గురివిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, నాగార్జునరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, బాలు,పాల్గొన్నారు.

మాట తప్పడు... మడమ తిప్పడు

కమలాపురం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పడు... మడమ తిప్పడు.. అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె, అల్లుడు డా.రమ్యతారెడ్డి, డా.విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. కమలాపురం నగరంలోని 16, 17, 19 కౌన్సిల్ వార్డులో శనివారం వారు ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా ఉన్న రవీంద్రనాథ్‌రెడ్డి, అవినాష్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ప్రచారం చేశారు. ఎస్‌స. పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, టీవ. సుబ్బరాయుడు, మోహన్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, హిదాయత్, గఫార్, సునీల్‌రెడ్డి, షారుక్, మోనార్క్, ఖాజా హుసేన్, కిట్టు, లక్ష్మీ నారాయణరెడ్డి, అంబటి సురేష్ పాల్గొన్నారు.

నేను సైతం.. సిద్ధం

కమలాపురం : కమలాపురం పట్టణానికి చెందిన వికలాంగుడు రెడ్డయ్య నేను సైతం.. సిద్ధం అంటూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుమార్తె, కుమారుడు డా.రమ్యతారెడ్డి, డా విజయభాస్కర్‌రెడ్డిల వెంట తిరుగుతూ ప్రచారంచేశారు. జగనన్న పంపిణీ చేసిన బ్యాటరీ ట్రై సైకిల్‌లో ఇంటింటాతిరుగుతూ ఇలా ప్రచారంలో పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాలు

వల్లూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిసున్న జగనన్నను మళ్లీ సీఎం చేయాలని ఎమ్మెల్యే పీ.రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర ఛైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. వల్లూరు మండల పరిధిలోని కోట్లూరు, బీచువారిపల్లె, ఆదినిమ్మాయపల్లె పంచాయతీలోని కొత్త గాలివారిపల్లె గ్రామాలలో శనివారం ఉపాధి హామీ కూలీలతో వారు మాట్లాడుతూ వైఎస్‌ఆర్‌సీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి, కమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పీ రవీంద్రనాథరెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో అనీల్ కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, మస్తాన్, లక్ష్మినారాయణరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పుల్లయ్య, ఏసు, రఘు, రామ సుబ్బారెడ్డి, వెంట్రామిరెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండపేటలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



కమలాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న డా.రమ్యతారెడ్డి, డా.విజయభాస్కర్‌రెడ్డి